సాక్షి
కుమురం భీం

గురువారం । 9 । జనవరి । 2025



ఉత్పత్తిలో తగ్గేదేలే..!
శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–6 గని రికార్డు గనిగా పేరు సాధించింది. ఎస్‌డీఎల్ సెక్షన్‌లో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్న గనిగా రికార్డులు నెలకొల్పుతోంది. 8లో▸



కొలాంల కొంగు బంగారం
తిర్యాణి మండలం దంతన్‌పల్లిలో సోమవారం భీమన్న దేవర జాతర ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జాతర వైభవంగా నిర్వహించనున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.1 /13.9

ఆకాశం చాలా వరకు నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి తీవ్రత కొనసాగుతుంది. పగలు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



డీఎంహెచ్‌వో సీతారాంకు పండ్ల రసం ఇస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రతిఒక్కరూ ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. సమయానికి రక్తం లభించకపోవడంతో ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని, రక్తం కృత్రిమంగా తయారు చేయలేమన్నారు. యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా రక్తమార్పిడి జరిగి నూతన ఉత్తేజం వస్తుందన్నారు. డీఎంహెచ్‌వోతో పాటు డిపో మేనేజర్ విశ్వనాథ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్‌టీయూ సరియా, ఏడీసీ శంకర్, ఉద్యోగులు రక్తదానం చేశారు.

చైనా మాంజా అమ్మినా, వినియోగించినా చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను విక్రయించినా, వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చైనా మాంజా విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనుషులతోపాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉన్నందున ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నైలాన్, సింథటిక్ దారాలు పక్షులు, పర్యావరణానికి తీవ్ర హాని చేస్తాయని పేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చైనా మాంజా వినియోగం నిషేధంలో ఉందని, ప్రజలు గమనించాలని సూచించారు. ప్రజలు సమీపంలోని పోలీస్‌స్టేషన్, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

లింగాపూర్(ఆసిఫాబాద్): యువత క్రీడల్లో రాణించాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని చోర్‌పల్లిలో బుధవారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా క్రీడాసామగ్రి, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధులు, మహిళల కోసం దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. గంజాయి పండించినా.. అమ్మినా కేసు నమోదు చేస్తామన్నారు. సీఐ రమేశ్, ఎస్సైలు గంగన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఐదు నుంచి తొమ్మిదో తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 1 నుంచి https://tgcet.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్(ఎఫ్ఏసీ)గా ఎంఏఎం సిద్దిక్ బుధవారం జిల్లా కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. కాగజ్‌నగర్ డివిజన్ మిషన్ భగీరథ డిప్యూటీ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయనకు జిల్లా ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఈఈగా పనిచేసిన వెంకటపతి వరంగల్‌కు బదిలీపై వెళ్లారు. కార్యాలయ సిబ్బంది సిద్దిక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

పత్తి వ్యాపారుల దోపిడీ!



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధ మహిళా రైతు పేరు కురెంగ దుర్గాబాయ్. ఎల్లారం గ్రామానికి చెందిన ఈమె మూడు రోజుల కిందట 64 క్వింటాళ్ల పత్తిని తీసుకుని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లుకు వచ్చింది. బుధవారం మధ్యాహ్నం ఆమె పంటను పరిశీలించిన సీసీఐ అధికారులు రూ.7,421 ప్రకారం కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. సగం సరుకు దించగా మళ్లీ సీసీఐ అధికారులు వచ్చి పత్తి నాసిరకంగా ఉందంటూ కొనుగోలును తిరస్కరించారు. ఇదే అదనుగా జిన్నింగ్ మిల్లు యజమాని అదే పత్తిని తాను రూ.6000కు కొంటానని, లేదంటే ఇంటికి తీసుకెళ్లాలని ఖరాకండిగా చెప్పడంతో వృద్ధ మహిళా రైతుకు పాలుపోక ఆందోళనకు గురైంది.



మంచిర్యాల జిల్లా భీమిని మండలం కర్జిభీంపూర్‌కు చెందిన రైతు అభిలాష్‌కు అదే పరిస్థితి ఎదురైంది. అతను మంచిర్యాల జిల్లాలో సీసీఐ కొనుగోళ్లు నిలిపేయడంతో ఆసిఫాబాద్‌కు పంట తీసుకువచ్చాడు. ఇక్కడ అధికారులు కొనుగోలుకు తొలుత అంగీకరించి తర్వాత నిరాకరించారు. పత్తిని విక్రయించడానికి అతను సైతం మూడు రోజులుగా జిల్లా కేంద్రంలో పడిగాపులు కాస్తున్నట్లు తెలిసింది.

- జిల్లాలో సీసీఐ అధికారుల ఇష్టారాజ్యం
- ధర నిర్ణయించాక నాసిరకం పేరిట తిరస్కరణ
- ఇదే అదనుగా ధర తగ్గిస్తున్న జిన్నింగ్ మిల్లుల యజమానులు
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పత్తి రైతుల ఆందోళన
- అమాంతం ధర తగ్గిస్తే తీవ్ర నష్టమంటున్న కర్షకులు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో పత్తి కొనుగోళ్ల మాయలో రైతన్న తీవ్రంగా నష్టపోతున్నాడు. పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు వస్తున్న వారు గిట్టుబాటు ధర రాక ఆందోళన చెందుతున్నాడు. భారత పత్తి సంస్థ(సీసీఐ) చేస్తున్న కొనుగోళ్ల వ్యవహారం ఇందుకు కారణమవుతోంది. తొలుత ప్రభుత్వ గిట్టుబాటు ధరకు పత్తి కొనుగోలుకు అంగీకరించిన సీసీఐ అధికారులు తర్వాత నాసిరకం పేరిట దానిని తిరస్కరిస్తున్నారు. దీంతో అన్నదాతలు తెచ్చిన పత్తిని తక్కువ ధరకు వ్యాపారులు అడుగుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లు యజమాని క్వింటా పత్తిపై రూ.1400లకుపైగా తగ్గించి అడగడంతో పత్తి రైతులు మిల్లు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో వ్యాపారుల దోపిడీ పర్వం



జిన్నింగ్ మిల్లు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

వెలుగులోకి వచ్చింది.

తొలుత అంగీకారం.. తర్వాత తిరస్కారం

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డ వద్ద ఉన్న ఓ జిన్నింగ్‌లో పత్తిని విక్రయించడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగునే ఉన్న మంచిర్యాల జిల్లా నుంచి రైతులు వస్తుంటారు. బుధవారం ఉదయం నుంచి పత్తి సరుకు వాహనాలతో క్యూలో ఉన్న రైతుల వద్దకు వచ్చిన సీసీఐ అధికారులు పత్తిని పరిశీలించారు. తేమ శాతం పరీక్షించిన అనంతరం పత్తిని కొనుగోలు చేయడానికి అంగీకరించారు. మహిళా రైతు దుర్గాబాయ్,



దుర్గాబాయ్ పత్తిని రిజెక్ట్ చేసినట్లు గేట్ అవుట్‌పాస్‌లో సంతకం చేసిన సీసీఐ అధికారులు

మరో రైతు అభిలాష్ తాము తీసుకొచ్చిన సరుకులో సగభాగానికి పైగా పత్తిని ఆ జిన్నింగ్ మిల్లులో దించేశారు. మిగిలిన మొత్తాన్ని దించుతుండగా అక్కడికి చేరుకున్న సీసీఐ అధికారులు ఆయా రైతుల పత్తి నాసిరకంగా ఉందంటూ కొనుగోళ్లను తిరస్కరిస్తున్నట్లు గేట్ ఎంట్రీ పాస్‌లో రాసివ్వడంతో అక్కడ ఉన్న రైతులందరూ ఆందోళనకు దిగారు.

రైతులను నష్టపోనియ్యం

జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో పలువురు రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తి నాసిరకంగా ఉందంటూ సీసీఐ అధికారులు తిరస్కరించిన విషయం నా దృష్టికి వచ్చింది. అయితే వారికి నష్టం వాటిల్లకుండా మరో జిన్నింగ్ మిల్లులో ఆయా రైతుల పత్తిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం.
– అశ్వక్ అహ్మద్, ఏడీ, మార్కెటింగ్ శాఖ

జిన్నింగ్ యజమాని మాయ

సీసీఐ అధికారులు తిరస్కరించిన పత్తిని మరోచోట విక్రయించే పరిస్థితి దాదాపు ఉండదు. ఇదే అవకాశంగా భావించిన స్థానిక జిన్నింగ్ మిల్లు యాజమాని రైతుల వద్దకు వచ్చి క్వింటాకు రూ.6వేల ధర తాను చెల్లిస్తానంటూ బేరమాడగా.. రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పైగా మిల్లు వద్ద కాంటా సైతం సరిగా లేదంటూ ఆందోళన చేపట్టి.. కాంటాను పలుమార్లు పరీక్షించడం కనిపించింది. తొలుత కాంటాలో తప్పుడు రీడింగ్ ఉన్నట్లు గ్రహించిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మిల్లులో పనిచేసే సిబ్బంది తర్వాత దానిని సరిచేయడం గమనార్హం.

పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని నంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులతో పాటు మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలు, రిజిస్టర్లు పరిశీలించారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న తాగునీరు, మూత్రశాలల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదనపు బోరు మంజూరు చేయాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా నూతన మెనూ ప్రకారం పోషకాహారం అందించాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం నంబాలలో సోలార్ ప్లాంటు ఏర్పాటుకు భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఏపీడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌక్‌లో ఎస్ఎస్ క్లీన్ అండ్ గ్రీన్ సేవా సంతన్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ నెల 26లోగా పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం నజ్రూల్‌నగర్ సోలార్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


అరచేతిలో 'ఉపాధి' సమాచారం

- ఉపాధిహామీ పనుల్లో పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి
- అందుబాటులోకి జన్‌మన్‌రేగా యాప్
- కూలీలు సైతం వేగంగా వివరాలు తెలుసుకునే అవకాశం
- జిల్లాలో 1,23,010 జాబ్‌కార్డులు

ఆసిఫాబాద్‌అర్బన్: వలసలు అరికట్టేందుకు ప్రారంభించిన ఉపాధిహామీ పథకం ఏటా లక్షలాది మంది కడుపు నింపుతోంది. మరోవైపు అక్రమాలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో పారదర్శకత కోసం సరికొత్త నిబంధనలు అమలు చేస్తూ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. కూలీలు సైతం అరచేతిలో వేగంగా వివరాలు తెలుసుకునే విధంగా జన్‌మన్‌రేగా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందూ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం ఉంది.

జిల్లాలో 1,23,010 జాబ్‌కార్డులు

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం 1,23,010 జాబ్ కార్డులు ఉండగా ఇందులో 1,23,010 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. అలాగే మొత్తం 2,44,026 కూలీల్లో 1,70,396 మంది పనులకు వస్తున్నట్లు ఈజీఎస్ అధికారులు తెలిపారు. జిల్లాలో యాసంగిలో పంటల సాగు అంతంతే ఉంటుంది. దీంతో వర్షాకాలం పంటల సీజన్ ముగిసిన తర్వాత ఎక్కువ మంది ఉపాధి పనులకు వెళ్తుంటారు. కూలీల ఖాతాలు సక్రమంగా లేకపోవడం, కూలి నగదు ఖాతాల్లో జమ కాకపోవడం, ఇతర సమస్యలతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. కూలీలు జన్‌మన్‌రేగా యాప్ ద్వారా నగదు చెల్లింపులకు కారణాలను కూడా తెలుసుకోవచ్చు. కుటుంబానికి



జన్‌మన్‌రేగా యాప్

సంబంధించిన వివరాలనూ సరిచూసుకోవచ్చు.

మరింత పకడ్బందీగా..

ఉపాధిహామీ పనుల్లో ఏటా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు సామాజిక తనిఖీలు చేపట్టి గ్రామసభల్లో పనుల వివరాలు వెల్లడిస్తూ అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తున్నారు. అయితే నిధుల రికవరీ మాత్రం పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం పథకం అమలులో అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే కూలీల లైవ్ లొకేషన్‌తో ఫొటో అప్‌లోడ్ చేయాలనే నిబంధనను తీసుకువచ్చింది. ఆన్‌లైన్ హాజరుతో చాలా వరకు అవకతవకలకు అడ్డుకట్ట పడింది. ఇప్పుడు ఉపాధిహామీ పథకానికి సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా తెలుసుకునేందుకు జన్‌మన్‌రేగా యాప్‌ను అభివృద్ధి చేసింది. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబం గుర్తింపు నంబర్ వివరాలు ముందుగా నమోదు చేయాలి. పేమెంట్ ఆప్షన్‌లో వ్యక్తి పేరు మీద క్లిక్ చేస్తే ఎక్కడ పని చేశారు.. పని దినాల సంఖ్య.. వేతనం ఎంత.. ఎప్పుడు జమైంది.. ఏ బ్యాంకు ఖాతా ఉంది.. అనే వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. అలాగే ఆధార్ నంబర్ లింకు అయిందా లేదా.. ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టం లింకు అయిందో కూడా సరి చూసుకోవచ్చు. అన్ని వివరాలు సక్రమంగా ఉంటే పచ్చ రంగు కనిపిస్తుంది. సమస్య ఉన్నచోట ఎరుపు రంగు చూపుతుంది. అలాగే జాబ్‌కార్డులోని కుటుంబ సభ్యుల పని వివరాలు కూడా ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు. ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు.. కుటుంబంలో ఎవరు ఎన్ని రోజులు పనికి వచ్చారు అనే వివరాలు స్పష్టంగా చూపిస్తుంది. కూలీలకు పూర్తి వివరాలు తెలిస్తే అక్రమాలు జరిగిన సమయంలో సిబ్బంది, అధికారులను నిలదీసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

అవగాహన కల్పిస్తాం

జనమన్‌రేగా యాప్ వినియోగంపై ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తాం. ఈ యాప్ ద్వారా కూలీలు పనులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు యాప్ ఇన్‌స్టాల్ చేసుకునే విధంగా గ్రామాల్లో ఎఫ్ఏలు, టీఏల ద్వారా ప్రచారం చేస్తాం.
– దత్తారావు, డీఆర్‌డీవో

ఆర్థిక సాధికారతతోనే మహిళల ఎదుగుదల



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్: ఆర్థిక సాధికారతతోనే మహిళల ఎదుగుదలకు అవకాశం ఉంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర మంత్రి సీతక్క, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేశ్, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్‌తో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి, 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇంధన గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గతేడాది ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. రానున్న ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలని ఉద్దేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. మహిళా సంఘాలు వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు. సోలార్ పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న భూమిని గుర్తించాలన్నారు. ప్రతీ జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా భూమి సేకరించాలన్నారు. ప్రధానమంత్రి కుసుమ్ పథకంలో భాగంగా రైతులు 2 మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. టీజీ రెడ్‌కో పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో మహిళా సంఘాలు, రైతుల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వాంకిడి జెడ్పీ హైస్కూల్‌కు పురస్కారం




పురస్కారం అందుకుంటున్న హెచ్‌ఎం నటరాజ్

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హైబిజ్ టీవీ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారం– 2024 లభించిందని హెచ్‌ఎం నటరాజ్ తెలిపారు. మల్టీజోన్–1లో జిల్లాస్థాయిలో ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేశారని, మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నట్లు వివరించారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. విద్యాసామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక తరగతులు, పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పురస్కారం రావడంతో బాధ్యత మరింత పెరిగిందని, ఉపాధ్యాయుల సమష్టి కృషితో పాఠశాలకు మరింత గుర్తింపు తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రావు, నాగరాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ నిర్ణేతలుగా గోలేటివాసులు



కుమ్మరి మల్లేశ్



భాస్కర్

రెబ్బెన(ఆసిఫాబాద్): హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనున్న 34వ సీనియర్ జాతీయస్థాయి సెపక్‌తక్రా టోర్నమెంట్‌కు న్యాయ నిర్ణేతలుగా రెబ్బెన మండలంలోని గోలేటి వాసులు ఎంపికైనట్లు సెపక్‌తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలిపారు. నేషనల్ టోర్నమెంట్ కమిటీ మెంబర్లుగా గోలేటికి చెందిన సీనియర్ క్రీడాకారుడు కుమ్మరి మల్లేశ్, సింగరేణి ఉన్నత పాఠశాల పీఈటీ కె.భాస్కర్ ఎంపికయ్యారని పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీల రెఫరీలుగా ఎంపికైన వారిని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, సెపక్‌తక్రా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శిరీష, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, మల్లేష్, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి అభినందించారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసు కుటుంబాలకు కష్టకాలంలో అండగా ఉంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఏఎస్సై మక్సూద్ అహ్మద్ కుటుంబ సభ్యులకు బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో రూ.8,60,000 విలువైన చెక్కు అందించారు. బాధిత కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇతర బెనిఫిట్స్ వేగంగా అందేవిధంగా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, ఏవో శ్రీనివాస్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్‌రెడ్డి, సిబ్బంది వర్మ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఎస్పీని కలిసిన ఇన్‌చార్జి డీఎస్పీ

డీసీఆర్బీ, ఫంక్షనల్ వర్టికల్ ఇన్‌చార్జి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్ బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో జిల్లాలోనే డీఎస్పీగా విధులు నిర్వర్తించిన కరుణాకర్‌ను ఇటీవల డీజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. మళ్లీ డీసీఆర్బీ, ఫంక్షనల్ వర్టికల్ ఇన్‌చార్జి డీఎస్పీగా బాధ్యతలు అప్పగించారు.

రైతులకు యుద్ధప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్లు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రత్యేక కార్యాచరణలో భాగంగా రైతులకు యుద్ధప్రాతిపదికన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నట్లు ఆ శాఖ ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ రాథోడ్ శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 987 కనెక్షన్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. 2023తో పోల్చుకుంటే దాదాపు 3.5శాతం ఇది అధికమన్నారు. రైతులు దరఖాస్తులు ఎక్కడ పెండింగ్ ఉన్నాయి.. అందుకు గల కారణాలను అగ్రికల్చర్ పోర్టల్‌లో చూసుకునే వెసులుబాటు ఉందన్నారు. అలాగే ఈ–స్టోర్స్ విధానం ద్వారా మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా రిజర్వ్ చేసుకుని పనులు ప్రారంభిస్తున్నామని వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

ప్రతిరోజూ భోజనం రుచి చూడాలి

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రతిరోజూ ఉపాధ్యాయులు రుచి చూడాలని జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఇందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. దొడ్డు బియ్యం సరఫరా కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, ప్రతీ వారం మూడు గుడ్లు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయురాలు సరోజ తదితరులు ఉన్నారు.



భోజనం చేస్తున్న జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ

క్లుప్తంగా

బంగారు మైసమ్మ ఆలయంలో చోరీ

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల శివారు జాతీయ రహదారి పక్కన ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. తాళ్ల గురిజాల ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి గుడి తలుపులు పగుల గొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని 15 తులాల వెండి, పావు తులం బంగారు ముక్కు పుడకను దొంగిలించారు. బుధవారం ఉదయం బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ గుడిని సందర్శించారు. పోలీసు జాగిలాలు, క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. గుడి నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

భీమారం: అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని ఆరెపల్లిలోని రేషన్‌దుకాణం నుంచి మంగళవారం రాత్రి ఆటోలో బియ్యం తరలిస్తుండగా డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. బుధవారం సివిల్ సప్లయిస్ డీటీ ప్రవంతి రేషన్‌దుకాణాన్ని సందర్శించి నిల్వలో తేడా ఉన్న 11క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. డీలర్ స్వర్ణలతపై కేసు నమోదుచేశారు.

వ్యక్తిపై కేసు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన అబ్దుల్లాపూర్ భోజారెడ్డి అనే వ్యక్తి పోలీసులతో దురుసుగా ప్రవర్తించడంతో అతడిపై కేసు నమోదు చేశారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం పోలీసులు మంగళవారం సాయంత్రం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అబ్దుల్లాపూర్ భోజారెడ్డి మద్యం సేవించి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్న క్రమంలో అతడిని ఆపారు. డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ప్రపుల్‌పై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో భోజారెడ్డిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోడిపందేల నిర్వాహకుల బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలో గతంలో కోడి పందేలు నిర్వహించిన నలుగురు వ్యక్తులను బుధవారం హాజీపూర్ పోలీసులు హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేశారు. హాజీపూర్ మండల పరిధిలో ఎలాంటి కోడిపందేలు నిర్వహించకుండా బైండోవర్ చేసినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు.

చిరుత దాడిలో ఆవు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని కొత్తగూడ అటవీ ప్రాంతంలో రెండు రోజుల క్రితం చిరుత దాడిలో ఆవు మృతి చెందింది. ఎఫ్‌ఆర్‌వో పుండలిక్ తెలిపిన వివరాల ప్రకారం.. బజార్‌హత్నూర్ గ్రామ రైతు ప్రశాంత్ దేశ్‌పాండేకు చెందిన ఆవులను కాపరి గ్రాసం నిమిత్తం సోమవారం కొత్తగూడ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. అందులో రెండు ఆవులు తప్పిపోయాయి. దీంతో రైతు గ్రామస్తులతో కలిసి బుధవారం అటవీ ప్రాంతంలో గాలించగా ఒక ఆవు కళేబరం లభ్యమైంది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. డిప్యూటీ ఎఫ్‌ఆర్‌వో ప్రవీణ్, ఎఫ్‌బీవో తిరుపతి తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత దాడిలో ఆవు మృతి చెందినట్లు నిర్ధారించారు. మరో ఆవు జాడ మాత్రం లభ్యం కాలేదు. కాగా, యజమానికి పరిహారం అందజేస్తామని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు.

రైల్వేలైన్ మళ్లీ మొదటికి..!

- తెరపైకి ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ లైన్
- తాజాగా కేంద్రమంత్రిని కలిసిన 'ఏలేటి'
- సానుకూలంగా స్పందించిన అశ్వినీవైష్ణవ్
- మొన్నటి ఎన్నికల హామీ ఏమైంది?
- ఇప్పటికైనా.. కలల రైలు వచ్చేనా?



2017 జనవరి 23న ఢిల్లీలో అప్పటి కేంద్రమంత్రి సురేశ్‌ప్రభును కలిసిన అప్పటి మంత్రులు, ఎంపీ



గతేడాది సెప్టెంబర్‌లో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రాంతంలో సర్వే చేస్తున్న రైల్వే సిబ్బంది

నిర్మల్: ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ కథ మళ్లీ మొదటికొచ్చింది. పాలకులు మారినప్పుడల్లా ఈ రైల్వేలైన్ ఏర్పాటు అంశం మొదటి నుంచి ప్రారంభమవుతోంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి బీఆర్‌ఎస్ పాలకులు సీరియస్‌గా ఈ రైలుమార్గాన్ని పూర్తి చేస్తామంటూ ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని, అటు ఢిల్లీని జాయింట్‌వెంచర్‌గా చేయడానికి ఒప్పించి వచ్చారు. ఏళ్లు గడిచినా.. కనీసం అడుగు కూడా ముందుకు పడలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఆర్మూర్ నుంచి కాదని, హైదరాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు భారీ బడ్జెట్‌తో రైల్వేలైన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఇది కూడా ఇప్పటిదాకా ఊసులేదు. ఇక తాజాగా మంగళవారం బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిశారు. మళ్లీ ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ లైన్ పూర్తి చేయాలని కోరడం గమనార్హం. దీంతో అసలు.. ఈ లైన్ ఎప్పటికి ప్రారంభమవుతుందో.. ఎన్నాళ్లకు పూర్తవుతుందోనని నిర్మల్, ఆదిలాబాద్ ప్రజలు చర్చించుకుంటున్నారు.

అలా మొదలై..

నిర్మల్–ఆదిలాబాద్‌కు ఇటు రాష్ట్ర, అటు జాతీయ సంబంధాలు, అభివృద్ధి పనులు, రవాణావ్యవస్థ మెరుగవ్వాలంటే పక్కా రైల్వేలైన్ ఉండాలన్న డిమాండ్ దశాబ్దాల నుంచి ఉంది.

- 1991లో ఆదిలాబాద్ ఎంపీగా ఉన్నప్పుడు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో పలుసార్లు కేంద్ర బడ్జెట్‌లో 'ఆదిలాబాద్‌లో కొత్త రైల్వేలైన్ సర్వే కోసం నిధులు కేటాయిస్తున్నాం..' అంటూ ప్రకటించారు.
- ఉమ్మడిజిల్లా నుంచి కేంద్రమంత్రిగా చేసిన వేణుగోపాలాచారి, ఆ తర్వాత ఎంపీలూ కొంతమేర ప్రయత్నం చేశారు.
- 2016లో పెద్దపల్లి–నిజామాబాద్ రైల్వేలైన్ పూర్తయిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న నిర్మల్–ఆదిలాబాద్ లైన్ ఏర్పాటుపై 'రైలురాక కలేనా..' శీర్షికన డిసెంబర్ 26న 'సాక్షి' బ్యానర్ కథనాన్ని ప్రచురించింది.
- దీంతో ఎనిమిదేళ్లక్రితం 2017 జనవరి 23న అప్పటి సీఎం కేసీఆర్ జాయింట్‌వెంచర్ కింద నిర్మాణానికి ఒప్పుకొంటూ రాసిచ్చిన లెటర్‌తో అప్పుడు మంత్రులుగా ఉన్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, అప్పుడూ ఎంపీగానే ఉన్న ప్రస్తుత ఎంపీ నగేశ్ ఢిల్లీ వెళ్లారు. అప్పటి రైల్వేమంత్రిగా ఉన్న సురేశ్‌ప్రభును కలిశారు. ఈమేరకు ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ రాష్ట్రంతో కలిసి జాయింట్ వెంచర్‌గా నిర్మించేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
- 2017–18లోనే చేసిన ప్రాథమిక సర్వే మేరకు ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు దాదాపు 125కిలో మీటర్ల దూరం రైల్వేలైన్ నిర్మాణానికి గాను రూ.2,720కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈలెక్కన రాష్ట్రం దాదాపు రూ.1,300కోట్ల వరకు ఖర్చుచేయాల్సి వస్తుండటంతో వెనుకంజ వేసింది. ఎనిమిదేళ్లు గడిచినా కనీసం జాయింట్‌వెంచర్‌కు సంబంధించి ఎంఓయూ (మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్)కూ రాలేదు.

కేంద్రమంత్రిని కలిసిన 'ఏలేటి'

తీరని కలగానే మిగిలిన రైలు కథ తాజాగా మళ్లీ మొదటికొచ్చింది. నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌తో కలిసి మంగళవారం రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కలిశారు. ఈ భేటీలో ప్రధానంగా నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను కలిపే ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్‌ను నిర్మించాలని వారు మంత్రి కోరారు. ఈమేరకు అశ్వినీవైష్ణవ్ కూడా హామీ ఇవ్వడం గమనార్హం. మరోవైపు గత పరిణామాల నేపథ్యంలో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వాసుల్లో ఇప్పటికీ అనుమానాలే ఉన్నాయి. కానీ.. మూడు జిల్లాల పరిధిలో ఎంపీలతో పాటు ఆరు ఎమ్మెల్యే స్థానాలను బీజేపీ గెలవడం, ఏలేటి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంతో ఈసారి రైల్వేలైన్ పూర్తవుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేస్తున్నారు.

హైదరాబాద్ నుంచి వేస్తామని..

రైల్వేలైన్‌పై 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వేళ మళ్లీ కదలిక వచ్చింది. అప్పుడూ కేంద్రమంత్రిగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానే ఉన్న కిషన్‌రెడ్డి పలు రైల్వేమార్గాలపై మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, నిజాంపేట్, సంగారెడ్డి మీదుగా పటాన్‌చెరు వరకు రూ.5,706 కోట్లతో లైన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. మూడు దశాబ్దాల క్రితం ఆదిలాబాద్, నిర్మల్, ఆర్మూర్, డిచ్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వరకు రైల్వేలైన్ ప్రతిపాదన ఉండేది. ఆ మార్గాన్నే మారుస్తూ ఎన్నికలకు ముందు కేంద్ర మంత్రి కొత్త ప్రతిపాదన తీసుకువచ్చారు. ఇక రాష్ట్రంతో జాయింట్ వెంచర్‌గా కాకుండా కేంద్రమే ప్రతిపాదిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం, ఈమేరకు ఓ సర్వే కూడా పూర్తి కావడంతో నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వాసుల్లో మళ్లీ ఆశలు రేకెత్తాయి.

ఉత్పత్తిలో తగ్గేదేలే..!

- రికార్డుల గని ఆర్కే–6
- ఎస్‌డీఎల్ ఉత్పత్తిలో కంపెనీ స్థాయిలో మొదటి స్థానం
- ఇప్పటికే ఐదుసార్లు అవార్డులు కైవసం
- ఆదర్శంగా నిలుస్తున్న భూగర్భ గని



గనిలో ఎస్‌డీఎల్ యంత్రం

ఎస్‌డీఎల్ సాధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలు

సంవత్సరం	రోజుకు టన్నులు	శాతం
2019–20	173	114
2020– 21	155	88
2021– 22	130	101
2022– 23	114	116
2023– 24	107	108

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే–6 గని రికార్డు గనిగా పేరు సాధించింది. కంపెనీ వ్యాప్తంగా ఉన్న 22 భూగర్భ గనుల్లో ఎస్‌డీఎల్ సెక్షన్‌లో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్న గనిగా రికార్డులు నెలకొల్పుతోంది. ప్రతీ సంవత్సరం తన రికార్డును తానే తిరగరాస్తూ ఇతర గనులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ గనిలో సగటున ఒక్కో ఎస్‌డీఎల్ యంత్రం రోజుకు 110 టన్నుల పైబడి ఉత్పత్తి తీస్తోంది. కంపెనీ వ్యాప్తంగా ఇతర గనుల్లో కేవలం 95 టన్నుల వరకే ఉత్పత్తి తీస్తున్నారు. 2024 డిసెంబర్ 23న కొత్తగూడెంలో జరిగిన సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం చేతుల మీదుగా గని అధికారులు, ఉద్యోగులు అవార్డు అందుకున్నారు.

2020 నుంచి అవార్డులు..

ఎస్‌డీఎల్ సెక్షన్‌లో అధిక ఉత్పత్తి సాధిస్తున్న గనుల్లో ఆర్కే–6 గని 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి వరుసగా ఐదుసార్లు ఈ అవార్డులు అందుకుంది. ప్రణాళికతో పని చేయడం వల్ల ఈ ఉత్పత్తి సాధిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రతీ ఎస్‌డీఎల్ యంత్రానికి రెండు వర్కింగ్ ప్లేస్‌లు కేటాయించడం, టబ్బుల ట్రాక్ లైన్‌ను యంత్రానికి దగ్గర ఉండేలా ఏర్పాటు చేయడం, యంత్రాల బ్రేక్‌డౌన్లు లేకుండా నిర్ణీత సమయానికి నిర్వహణ చేపట్టడంతో పనితీరు మెరుగ్గా ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఎస్‌డీఎల్ సెక్షన్‌లో రూఫ్ సపోర్టును పటిష్టంగా చేస్తున్నారు. ఈ గనిలో మొత్తం ఆరు ఎస్‌డీఎల్ యంత్రాలు నడుస్తున్నాయి. రెండు సీమ్‌ల్లో బొగ్గు తీస్తున్నారు. 765 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఎన్నో రికార్డులు నమోదు చేసుకున్న ఈ గని నిల్వలు అడుగంటడంతో ఒకటి రెండేళ్లలో మూతపడనుండడం గమనార్హం.

సమష్టి కృషితోనే సాధ్యం



ఉద్యోగులు, సూపర్‌వైజర్లు, అధికారుల సమష్టి కృషితోనే ఎస్‌డీఎల్ సెక్షన్‌లో ఇప్పటికి ఐదు సార్లు కంపెనీ స్థాయిలో బెస్ట్ ఎస్‌డీఎల్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నాం. ఏరియా జీఎం, ఇతర ఉన్నత అధికారుల సహకారంతో లక్ష్య సాధన కోసం పని స్థలాల్లో కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఈ.తిరుపతి, మేనేజర్, ఆర్కే–6 గని

సమయం దాటి పని చేస్తున్నాం



కంపెనీలోనే నెంబర్ వన్‌గా నిలువడం కోసం షిఫ్ట్ సమయం దాటిన కూడా పని చేస్తున్నాం. ప్రణాళికలతో పని చేయడం వల్లే ఈ లక్ష్యాన్ని సాధించాం. అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాం.

– బండ సుదర్శన్, ఎస్‌డీఎల్ ఆపరేటర్

సొంతింటి పథకం అమలు చేయాలి

శ్రీరాంపూర్: కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి పథకం అమలు చేయాలని సీఐటీయూ కేంద్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి యాజమాన్యం, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సింగరేణి స్థలాల్లో కార్మికులకు ఇంటి స్థలం ఇవ్వాలని అన్నారు. కంపెనీ కార్మికులకు కేటాయించిన క్వార్టర్లకు నెలకు రూ.5 వేలు నిర్వహణ వస్తుందని, కార్మికుడు కూడా క్వార్టర్‌లో ఉండడం వల్ల అలవెన్సులపై నెలకు రూ.3 వేల వరకు ఐటీ చెల్లించాల్సి వస్తుందని, హెచ్‌ఆర్‌ఏ కూడా కార్మికులకు మిగులుతుందని తెలిపారు. ఇలా ఒక్కో కార్మికుడు కంపెనీ క్వార్టర్‌లో కాకుండా ఇంటిస్థలం కేటాయిస్తే రూ.15 వేల వరకు ఆదా అవుతాయని అన్నారు. సింగరేణి క్వార్టర్లను కూల్చి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టాలని చూస్తే అడ్డుకుంటామని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల మారుపేర్లను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు నరహరిరావు, బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, నాయకులు కస్తూరి చంద్రశేఖర్, బానేష్, శ్రీనివాస్, సందీప్ కుమార్, రాజేష్, రాజబాబు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ అధ్యక్షుడు రాజారెడ్డి

పెన్‌గంగ దాటిన పులి

- పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలం కరంజి గ్రామంలో పులి సంచరిస్తున్నట్లు గుర్తించిన అటవీ శాఖ అధికారులు ప్రత్యేక బృందాలతో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలో పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా అందులో ఎలాంటి ఆనవాళ్లు చిక్కలేదు. అయితే బుధవారం పెన్‌గంగ పరిసర ప్రాంతాల్లో పులి పాదముద్రలను గుర్తించినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి గులాబ్ సింగ్ తెలిపారు. పెన్‌గంగ దాటి మహారాష్ట్ర వైపు వెళ్లినట్లు పేర్కొన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అయితే పంట చేలకు వెళ్లినప్పుడు గుంపులు గుంపులుగా, చప్పుడు చేసుకుంటూ వెళ్లాలని సూచించారు.



పెన్‌గంగ ప్రాంతంలో పులి అడుగులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

రెండు తలల పామును తరలిస్తున్న ముఠా పట్టివేత

చెన్నూర్: రెండు తలల పామును తరలిస్తున్న ముఠాను అటవీ అధికారులు మాటు వేసి పట్టుకున్నారు. స్థానిక ఫారెస్ట్ కార్యాలయంలో బుధవారం ముఠా వివరాలను ఫారెస్ట్ రేంజ్ అధికారి శివకుమార్ వెల్లడించారు. మహారాష్ట్ర నుంచి చెన్నూర్ మీదుగా రెండు తలల పామును కొందరు వ్యక్తులు తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఈ నెల 6న చెన్నూర్ మండలం చింతలపల్లి గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ కారులో రెండు తలల పామును గుర్తించారు. పాముతోపాటు కారు, మోటార్‌సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామానికి చెందిన కదార్ల ధనుంజయ్, కొల్లూరు గ్రామానికి చెందిన కొరాళ్ల సంతోశ్, బోరంపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాజ్‌గోపాల్, చెన్నూర్‌కు చెందిన వేములు తిరుపతి, శ్రీరాంపూర్‌కు చెందిన కుంభం పోచిరెడ్డి, మహారాష్ట్రలోని కొప్పుల గ్రామానికి చెందిన సుదర్శన్, ప్రభాకర్ ముఠాగా ఏర్పడి పామును తరలిస్తున్నారని విచారణలో తేలింది. ఏడుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు. సమావేశంలో అటవీ అధికారులు ప్రభాకర్, చంద్రమోహన్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఫారెస్ట్ అధికారి

గుప్త నిధుల కోసం..!

రెండు తలల పాము గుప్త నిధులను పట్టిస్తుందని కొందరు నమ్ముతారు. దీంతో గుప్త నిధుల వేటగాళ్లు రెండు తలల పామును కొనుగోలు చేస్తారని తెలిసింది. ఈ పామును రూ.40 లక్షలకు అమ్మేందుకు తరలిస్తుండగా పట్టుబడినట్లు ప్రచారం జరుగుతోంది.

నేటి నుంచి ఫుట్‌బాల్ పోటీలు

- రాష్ట్ర స్థాయి అండర్–13 బాలికల చాంపియన్‌షిప్
- పాల్గొననున్న ఆయా జిల్లాల జట్లు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లో తెలంగాణ స్థాయి బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. ఖేలో ఇండియా గేమ్స్‌లో భాగంగా నిర్వహించే ఈ పోటీలకు తెలంగాణలోని ఆయా జిల్లాల జట్లు హాజరవుతున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలకు స్థానిక ఠాగూర్ స్టేడియం ముస్తాబైంది. ఉదయం పది గంటలకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ లాంఛనంగా పోటీలు ప్రారంభించనున్నారు.

పాల్గొనే జట్లు ఇవే...

తెలంగాణ(సౌత్‌జోన్) బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం నుంచి మొత్తం ఆరు జట్లు పాల్గొననున్నాయి. ఎలెవన్‌స్టార్ ఫుట్‌బాల్ అకాడమీ పేరిట ఆతిథ్య ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు, ట్విన్‌సిటీస్ హైదరాబాద్ జట్టు, తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ జట్టు, కేర్ ఫుట్‌బాల్ అకాడమీ నిజామాబాద్ జట్టు, గజ్వేల్ ఫుట్‌బాల్ అకాడమీ సిద్దిపేట జట్టు, వుమెన్స్ ఫుట్‌బాల్ అకాడమీ(హైదరాబాద్, ఖమ్మం కంబైన్డ్) జట్లు పాల్గొంటాయి. లీగ్ పద్ధతిలో నిర్వహించనుండగా ఒక్కో జట్టు మిగతా ఐదు జట్లతో తలపడుతుంది. లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరచి ఉత్తమంగా నిలిచిన నాలుగు జట్లు సెమీస్‌లో తలపడతాయి.

మద్యానికి బానిసై యువకుడి బలవన్మరణం

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన రాజుల సాయి (35) మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన అతడితో కుటుంబీకులు గొడవపడ్డారు. దీంతో అర్ధరాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లిన సాయి పురుగుల మందు తాగి వచ్చాడు. గమనించిన కుటుంబీకులు 108కు సమాచారమిచ్చారు. వారు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. సాయి భార్య నాలుగేళ్ల క్రితమే పుట్టింటికి వెళ్లిపోగా తల్లి భోజవ్వతోనే ఉంటున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



సాయి మృతదేహం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి వాడ కాలనీకి చెందిన సోమ్మయ్య(35) ఓ మామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. బుధవారం ఉదయం అటువైపు వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఘటన స్థలాన్ని డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. కాగా, సోమయ్య స్నేహితులతో కలిసి దావత్ చేసుకోవడానికి మంగళవారం బయటకు వెళ్లాడు. అక్కడ రాము, మరో ఇద్దరు స్నేహితులతో గొడవ జరిగిందని, రాము బాగా తిట్టాడని, ఇంటిని రానని సోమయ్య తనకు ఫోన్ చేసి చెప్పినట్లు ఆయన భార్య లక్ష్మి తెలిపింది. మరుసటి రోజు ఉదయం ఉరేసుకుని కనిపించాడు. స్నేహితులపై అనుమానం వ్యక్తం చేస్తూ లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ పేర్కొన్నారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటో బోల్తా: పలువురికి గాయాలు

ముధోల్: మండల కేంద్రంలోని నయాబాదిలో ఆటో బోల్తా పడగా పలువురు గాయపడ్డారు. వివరాలు.. ముధోల్ నుంచి అబ్దుల్లాపూర్‌కు వరి నాటు వేసేందుకు బుధవారం ముధోల్‌కు చెందిన ఎనిమిది మంది కూలీలు ఆటోలో వెళ్తున్నారు. నయాబాదికి రాగానే కుక్క అడ్డు రాగా అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అందరికీ గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారమిచ్చి అంబులెన్స్‌లో క్షతగాత్రులను బైంసా ఏరియాస్పత్రికి తరలించారు. వీరిలో గంగామణి కాలు, పోశెట్టికి పక్కటెముకలు విరిగినట్లు 108 సిబ్బంది తెలిపారు. గణిత, శిల్పకు తీవ్రగాయాలు, లక్ష్మి, స్వరూప, రజిత, లక్ష్మి, డ్రైవర్ అంజుకు స్వల్పగాయాలయ్యాయి.



అంబులెన్సులో క్షతగాత్రులు

ఆటోబోల్తా ఘటనలో మరో ఇద్దరు మృతి

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. దేగామ గ్రామ సమీపంలో మూలమలుపులో గిర్నూర్ గ్రామానికి చెందిన ఆటో అదుపు తప్పి బోల్తా పడిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన మహిళ అడెళ్ల(35) అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో మైలారపు అరుణ్(22), అయిల ఆశన్న(68) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం చనిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

విద్యుత్ స్తంభం పైనుంచి పడి కార్మికుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ స్తంభంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుడిహత్నూర్ మండలం సీతాగోంది గ్రామానికి చెందిన పెందూర్ అరుణ్ (30) విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీ చౌక్ ప్రాంతంలో మంగళవారం కేబుల్ వైర్ కాలిపోవడంతో దాన్ని సరిచేస్తున్నాడు. ఈ క్రమంలో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఇన్వర్టర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై స్తంభం నుంచి కింద పడ్డాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఇది వరకు అదే ప్రాంతంలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న సమయంలో ఇన్వర్టర్ నుంచి విద్యుత్ సరఫరా కావడంతో ఇద్దరు కార్మికులు మృత్యువాత పడ్డ సంఘటనలు చోటు చేసుకున్నాయి. అయినా ఆ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరో నిండు ప్రాణం బలైందని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయమై విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్‌ను వివరణ కోరగా మృతుడి కుటుంబానికి శాఖ తరపున రూ.5లక్షల పరిహారం అందించనున్నట్లు పేర్కొన్నారు.

మొరం ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న మొరం ట్రాక్టర్లు

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పట్టుకున్నామని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్థానిక కార్యాలయానికి తరలించామని పేర్కొన్నారు.

నిందితుడికి జైలు

కడెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతికి కారణమైన మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామానికి చెందిన బానావత్ లక్ష్మణ్‌కు బుధవారం ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్ కుమార్ 45రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2019 మార్చి 14న మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ బస్టాప్ వద్ద బానావత్ లక్ష్మణ్ టాటా మ్యాజిక్‌తో బైక్‌ను ఢీకొట్టగా, బైక్‌పై ప్రయాణిస్తున్న మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన పందిరి రాజేశ్వర్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు 2019లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా బుధవారం సాక్షులను ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

చోరీ కేసుల్లో వ్యక్తికి..

దండేపల్లి: నిర్మల్ జిల్లా దస్తూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్‌కు రెండు చోరీ కేసుల్లో లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్ బుధవారం శిక్ష విధించారు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రజాక్ చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నాడు. గత ఏడాది ఆగస్టు 22న దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన కాంద్రపు సరస్వతి ఇంటి తాళాలు పగులగొట్టి తులం బంగారు చైను, రూ.5వేల నగదు దొంగిలించాడు. సెప్టెంబర్ 27న దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన చుంచు సురేష్ ఇంట్లో పట్టపగలే రూ.20వేల నగదు అపహరించాడు. ఈ కేసుల్లో 3 నెలల 6 రోజులు, మరో కేసులో 2 నెలల 23 రోజుల శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

ఒకరిపై కేసు

నర్సాపూర్ (జి): నిర్మల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆదేశానుసారం ఆపరేషన్ స్మైల్–11లో భాగంగా లేబర్ డిపార్ట్‌మెంట్ జూనియర్ అసిస్టెంట్ మహేశ్, డీసీపీవో దేవి మురళి, ఎస్‌ఐపీ సాదిక్ హుస్సేన్ బుధవారం నర్సాపూర్ (జి) బస్టాండ్ ఏరియాలో తనిఖీలు చేపట్టారు. శ్రీలక్ష్మి పానీపూరి బండి యజమాని శంకర్ వద్ద ఇద్దరు మైనర్ బాలురు పనిచేస్తూ వీరికి పట్టుబడ్డారు. జూనియర్ అసిస్టెంట్ మహేశ్ ఫిర్యాదు మేరకు పానీపూరి బండి యజమాని శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.